తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :46 | 31-08- 2026 | సోమవారం | పేజీలు: 4 | వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు – విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా
రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే
ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కులో రాష్ట్ర వ్యాప్తంగా
స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు
ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో
ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో





## ఆరు సీజన్లుగా సీఎంఆర్ బకాయిలు చట్టాలకు లొంగని రైస్ మిల్లర్లు 42 కేసులు నమోదు

నిర్మల్ ఆగష్టు 30 తెలంగాణ వెన్నెల వాక్కు
నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ రైస్ కేటాయింపుల్లో ఊహించని రీతిలో భారీ మాయాజాలం వెలుగుచూసింది. ఆరు పంట సీజన్లు గడుస్తున్నా ప్రభుత్వానికి అప్పగించాల్సిన వందల కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్ల తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిర్మల్ జిల్లాలో పౌరసరఫరాల శాఖను సీఎంఆర్ బియ్యం బాగోతం తీవ్రంగా కలవరపెడుతోంది. 2022-23 ఖరీఫ్, రబీ సీజన్ల నుంచి మొదలుకొని వరుసగా ఆరు సీజన్లుగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన మిల్లింగ్ బియ్యం బకాయిపడటంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, మిల్లర్లకు కేటాయించిన ధాన్యమే మిల్లుల్లో లేకపోవడంతో ఇక బియ్యం రికవరీ అవకాశాలు ఎక్కడివని కొందరు సూటిగా ప్రశ్నిస్తున్నారు. 2022-23 ఖరీఫ్, రబీ సీజన్ మొదలుకొని 2025-26 యాసంగి సీజన్ వరకు సుమారు రూ. 250 కోట్ల సీఎంఆర్ అక్రమాలు జరిగినట్టు జిల్లాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

నిర్మల్ జిల్లాలో మొత్తం 54 రైస్ మిల్లులు ఉండగా, సగానికి పైగా మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని పెండింగ్‌లో ఉంచినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ప్రతి సీజన్లో మిల్లుకు కేటాయించిన ధాన్యంలో 67 కేజీల బియ్యాన్ని సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికి 60 రోజుల్లో చెల్లించవలసి ఉంటుంది. అయితే సంవత్సరాలు, సీజన్లు ముగిసిపోయినా ఇప్పటివరకు చాలా రైస్ మిల్లులు సీఎంఆర్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయి. సీఎంఆర్ బియ్యం పెండింగ్‌పై జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతినెలా సమీక్ష చేస్తున్నా మిల్లర్లలో మార్పు రావడం లేదు.

జిల్లాలో సీఎంఆర్ బియ్యం 2022 నుంచి పెండింగ్‌లో ఉంది. 2022-23 యాసంగి సీజన్లో మొత్తం రైస్ మిల్లులకు 1,58,566.320 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, రైస్ మిల్లర్లు 1,06,831.956 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. కానీ కేవలం 6,303.495 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అప్పగించడంతో ఇంకా 1,00,528.461 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించవలసి ఉంది. అంటే కేవలం 5.90 శాతం మాత్రమే రికవరీ అయింది. 2023-24 సీజన్లో 1,42,750.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 95,942.783 మెట్రిక్ టన్నులు అప్పగించాల్సి ఉండగా 89,995.294 మెట్రిక్ టన్నులు అప్పగించారు. ఇంకా 5,947.429 మెట్రిక్ టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉంది. మరో విడతలో 1,08,321.640 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 82,630.010 మెట్రిక్ టన్నులు అప్పగించాల్సి ఉండగా 63,324.674 మెట్రిక్ టన్నులు అప్పగించగా 18,995.336 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో పడింది.

2024-25 వానాకాలం సీజన్లో 1,14,185.081 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 76,866.738 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 61,221.260 మెట్రిక్ టన్నులు అప్పగించడంతో 15,645.679 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. యాసంగి సీజన్లో 1,53,949.120 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 1,03,590.373 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 35,889.039 మెట్రిక్ టన్నులు అప్పగించారు. ఇంకా 67,701.334 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. 2025-26 వానాకాలం సీజన్లో 59,396.000 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 39,910 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా 13,972.737 మెట్రిక్ టన్నులు ఇవ్వగా 25,937.422 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో మిగిలింది. యాసంగి సీజన్లో 1,71,872.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 1,15,651.883 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా 5,720.000 టన్నులు మాత్రమే అప్పగించగా 1,09,931.583 మెట్రిక్ టన్నులు ఇంకా పెండింగ్‌లో ఉంది.

ముఖ్యంగా 2023-24 వానాకాలం, యాసంగి సీజన్‌తో పాటు 2024-25 వానాకాలం సీజన్ సీఎంఆర్ పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉంది. అయితే ఇక్కడ వడ్లు కూడా లేకపోవడంతో బియ్యం వచ్చే అవకాశాలు తక్కువేనని అధికారులు చెబుతున్నారు. పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నా ధాన్యానికి, సీఎంఆర్ బియ్యానికి పొంతన కుదరడం లేదు. సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న 13 రైస్ మిల్లులకు కొత్తగా ధాన్యం కేటాయించలేదు. అధికారులు తనిఖీలు చేసినప్పుడు కాకి లెక్కలు చూపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని రైస్ మిల్లుల ఆస్తుల విలువ బియ్యం బకాయిల కంటే కేవలం 20 శాతంగానే ఉండటంతో రికవరీపై ఆందోళన నెలకొంది. కొందరు మిల్లర్లు బియ్యం ఇవ్వకుండా, ధాన్యం ఇవ్వకుండా వ్యాపారా లు మూసేసి కొత్త వ్యాపారాలు చేపడుతు న్నారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి నిర్మల్‌లో సీఎంఆర్ బియ్యంపై సమీక్ష చేసి లోపాలను గుర్తించి కఠిన చర్యలకు ఆదేశించారు. తాజాగా కలెక్టర్ భవేష్ మిశ్రా, రెవిన్యూ కలెక్టర్ కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, జిల్లా మేనేజర్ సుధాకర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. సివిల్ సప్లై డిఎం సుధాకర్ మాట్లాడుతూ.. గత సీజన్లలో బియ్యం కేటాయించని 34 రైస్ మిల్లులపై ఆర్ఆర్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, ఇప్పటివరకు మొత్తం 42 కేసులు నమోద య్యాయని తెలిపారు. సీఎంఆర్ సకాలంలో ఇచ్చే మిల్లులకే ధాన్యం కేటాయిస్తామని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ కేబినెట్ బాంబ్

### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఖాయం!



హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో సుదీర్ఘకాలంగా తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్న మంత్రివర్గ విస్తరణ వ్యవహారంపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి త్వరలోనే కేబినెట్ బెర్త్ లభించబోతోందనే స్పష్టమైన సంకేతాలను ఇవ్వడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమక్షంలో పీసీసీ చీఫ్ పేల్చిన ఈ బాంబ్ కాంగ్రెస్ వర్గాల్లోనూ, రాజకీయ విశ్లేషకుల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మంత్రివర్గ విస్తరణపై ముమ్మర కసరత్తు
తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీపై నిరంతరం 2

## తెలంగాణలో మారిన వాతావరణం: 13 జిల్లాలకు వర్ష సూచన!



హైదరాబాద్ బ్యూరో
తెలంగాణరాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో ఒక్కసారిగా తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. గత కొన్ని రోజులుగా తీవ్ర భానుడి ప్రతాపంతో, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ 2

## సిటీ నడిబొడ్డున మరో భూ బాగోతం

### సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ



తెలంగాణ బ్యూరో:
హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జ్యేష్ఠ నాయకుడు హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ – – అజామాబాద్ ప్రాంతంలో ఉన్న సుమారు రూ. 500 కోట్ల బహిరంగ మార్కెట్ విలువ కలిగిన ఆయిల్ ఫెడ్ స్థలాన్ని కేవలం రూ. 87 కోట్ల అతి తక్కువ మొత్తానికే ఒక ప్రైవేట్ వ్యక్తికి అప్పగించే కుట్ర జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ భూ బాగోతంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు ఒక బహిరంగ లేఖ రాశారు.

రూ. 500 కోట్ల భూమి.. కేవలం రూ. 87 కోట్లకే అప్పగింత:
గడిచిన మూడు దశాబ్దాలుగా (30 ఏళ్లుగా) ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్ ఆధీనంలో ఉన్న 3 ఎకరాల 23 గుంటల విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తుల హస్తగతం చేయడం వెనుక ఉన్న అసలు కారణాలను కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆ భూమిపై హక్కు పొందేందుకు, నిర్దేశించిన రూ. 87 కోట్ల మొత్తాన్ని చెల్లించేందుకు సొంత ప్రభుత్వ సంస్థ ఆయిల్ ఫెడ్ సిద్ధంగా ఉన్నప్పటికీ, దానిని కాదని ఒక ప్రైవేట్ వ్యక్తికి భూమిని కట్టబెట్టడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని లేఖలో వివరించారు.

సుప్రీంకోర్టు తీర్పును సైతం పక్కనబెట్టి నిర్ణయాలు:
ఈ వివాదాస్పద భూమిపై అనేక ఏళ్ల క్రితమే 3

## ఆర్ఎస్ఎస్ ది డబుల్ గేమ్:

### మోహన్ భగవత్ వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు!



హైదరాబాద్ బ్యూరో:
అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని, పెద్ద ఎత్తున చర్చను రేపుతున్నాయి. భారతదేశంలో ముస్లింలు నివసించకూడదని లేదా ఉండకూడదని భావించేవారు అసలైన హిందువులే కాదంటూ మోహన్ భగవత్ చేసిన ప్రకటనపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అత్యంత ఘాటుగా స్పందించారు. ఆర్ఎస్ఎస్ సంస్థ విదేశీ వేదికల వద్ద లేదా అంతర్జాతీయ సమాజం ముందు ఒకలా మాట్లాడి, తమ సొంత కార్యకర్తల వద్దకు వచ్చేసరికి మరొకలా మాట్లాడటం ఆ సంస్థకు మొదటి నుంచి ఉన్న పాత వ్యూహమేనని, ఇది స్పష్టంగా వారి 'డబుల్ గేమ్' అని ఒవైసీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు, ఆ సంస్థ పూర్వ నాయకుల రచనలు మరియు చారిత్రక ఆధారాలను ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు చేశారు.

విదేశాల్లో ఒక మాట.. కార్యకర్తలకు మరొక మాట:
ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలను ఎండగడుతూ ఎంపీ ఒవైసీ అనేక ప్రశ్నలను సంధించారు. ప్రపంచ దేశాల ముందు తమ ఇమేజ్‌ను కాపాడుకోవడానికి మరియు మంచిగా కనిపించడానికి 3

# డిజిటల్' ఒత్తిడిలో కార్యదర్శులు!

## - రాత్రింబవళ్లు యాప్‌ల ముందే కన్నీటి పయనం!
## - నిద్రలేని రాత్రుల్లో నిర్మల్ పంచాయతీ కార్యదర్శులు!

నిర్మల్ ఆగష్టు 30 తెలంగాణ వెన్నెల వాక్కు




గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పల్లెల ప్రగతికి ఊపిరి పోయాల్సిన పంచాయతీ కార్యదర్శులు నేడు యాప్‌ల ప్రపంచంలో బందీలయ్యారు. గ్రామ స్వరాజ్యం పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీడీపీ , జీ-సాప్ సర్వేల సేకరణ ప్రక్రియ క్షేత్రస్థాయి యంత్రాంగానికి తీరని వేదనను మిగుల్చుతోంది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో సాధారణ పాలనను పూర్తిగా పక్కనబెట్టి, రాత్రింబవళు మొబైల్ స్క్రీన్ల ముందే గడపాల్సిన దయనీయ పరిస్థితి దాపురించింది. ఉన్నతాధికారుల నుంచి వస్తున్న అంతులేని ఒత్తిడి, మెమోలు మరియు షోకాజ్ నోటీసుల భయంతో కార్యదర్శులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

**20 పేజీల చిట్టా.. ప్రతీ ఇంట్లో గంటల కొద్దీ వెతకాల్సిందే!**

ఒక్కో గ్రామంలోని ప్రతీ కుటుంబం వద్దకు వెళ్లి సేకరించాల్సిన సమాచారం కొండంతగా మారింది. దాదాపు 20 పేజీలతో కూడిన సుదీర్ఘమైన బుక్‌లెట్‌లో ఉన్న వందలాది కాలమ్‌లకు వివరాలు వెతకాల్సి వస్తోంది. నివాస గృహాల పరిస్థితి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ కనెక్షన్లు, కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, భూకమతాల విస్తీర్ణం, ఆరోగ్య వివరాలు, పశుసంపద.. ఇలా ఒక కుటుంబం నుంచి పూర్తి వివరాలు తీసుకోవడానికే గంటకు పైగా సమయం పడుతోంది. గ్రామంలో ఉన్న వందలాది కుటుంబాల వివరాలను సేకరించి ఆన్‌లైన్ నిబంధనల ప్రకారం నమోదు చేయడానికి వారాల సమయం పడుతున్నా, అధికారులు మాత్రం కేవలం ఒకటి రెండు రోజుల్లోనే లక్ష్యాలను పూర్తి చేయాలని కఠిన ఆంక్షలు విధిస్తున్నారు.

**సిగ్నల్ లేని పల్లెల్లో 'సర్వర్' చికాకులు**

మరోవైపు నిర్మల్ జిల్లాలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్రమైన నెట్‌వర్క్ సమస్యలు కార్యదర్శుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. కొండకోనలు, అటవీ సరిహద్దు గ్రామాల్లో మొబైల్ సిగ్నళు లభించక డేటా అప్‌లోడ్ కావడం లేదు. దీంతో గ్రామంలో సమాచారం సేకరించి, సిగ్నల్ వచ్చే ఎత్తైన ప్రాంతాలకు లేదా మండల కేంద్రాలకు వెళ్లి అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. సర్వర్‌ల సాంకేతిక లోపాల వల్ల గంటల తరబడి శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంటే, ఉన్నతాధికారులు మాత్రం క్షేత్రస్థాయి యథార్థాలను వినడానికి సిద్ధంగా లేరు. పని కాకపోతే సస్పెన్షన్లు జారీ చేస్తామని బెదిరిస్తుండటంతో సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

**రాత్రి వేళల్లో ఆన్‌లైన్ నరకం.. కుటుంబాలకు దూరం**

పగటిపూట గ్రామంలో ఇల్లు ఇల్లు తిరిగి సమాచారం సేకరిస్తే, రాత్రి వేళల్లో విధిగా ఆన్‌లైన్ ఎంట్రీలు పూర్తి చేయాల్సి వస్తోంది. ఆదివారాలు, పండుగలు అనే తేడా లేకుండా ఉన్నతాధికారులు జూమ్ మీటింగ్‌లు, రాత్రి 8-9 గంటల తర్వాత టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పురోగతిపై నిలదీస్తున్నారు. దీంతో కార్యదర్శులకు కనీస మానసిక విశ్రాంతి లేక నిద్రలేమి, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సొంత కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు కూడా సమయం దొరకడం లేదని పలువురు కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు.

**గ్రామాల్లో పడకేసిన అత్యవసర సేవలు**

కార్యదర్శులు పూర్తి సమయాన్ని ఈ డేటా సేకరణకే కేటాయించాల్సి రావడంతో పంచాయతీల్లో ప్రాథమిక విధులు పూర్తిగా స్తంభించిపోయాయి. వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల పర్యవేక్షణ, పన్నుల వసూలు వంటి నిత్యవసర పనులు పక్కకు నెట్టివేయబడ్డాయి. గ్రామాల్లో సమస్యలు చెప్పుకుందామని వచ్చే ప్రజలకు కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాల సాధన పేరిట పంచాయతీల స్వయంప్రతిపత్తిని, ప్రజలకు అందాల్సిన సేవలను దెబ్బతీయడం ఎంత వరకు సమంజసమని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

**మానవీయ కోణంలో ఆలోచించాలి**

డేటా నమోదుకు సంబంధించి శాస్త్రీయమైన ప్రణాళికను రూపొందించాలని నిర్మల్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం కోరుతోంది. గ్రామాల్లో డేటా ఎంట్రీకి ప్రత్యేక ఆపరేటర్లను ఏర్పాటు చేయాలని, అనవసరమైన గడువుల ఒత్తిడిని తగ్గించి సాంకేతిక లోపాలను సరిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తగినంత వ్యవధి కల్పిస్తేనే సరైన డేటాను సమర్పించగలమని, ఈ దిశగా ప్రభుత్వం స్పందించి వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తున్నారు.

# అక్షరం బందీ -- బడులు ఖాళీ!

## విద్యను బలికోరి 'వికసిత్ భారత్' సాధ్యమేనా?

'వికసిత్ భారత్'... నేడు పాలకుల ప్రసంగాలలో, ప్రకటనల్లో మార్మోగుతున్న డిజిటల్ నినాదం. 2047 నాటికి భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా నిలబెడతామనే ఆర్భాటం ఒకవైపు, ప్రాథమిక విద్యావ్యవస్థ పునాదులే కదిలిపోతున్న భయానక వాస్తవికత మరొకవైపు. విద్య కేవలం అక్షరజ్ఞానం మాత్రమే కాదని, అది మానవీయ విలువలకి, వివేకానికి, సామాజిక వికాసానికి, సమత్వానికి మూలస్తంభమని మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నమ్మారు. అణగారిన వర్గాల విముక్తికి విద్యనే ఏకైక మార్గంగా చూశారు. కానీ నేడు, ఆ మహనీయుల ఆశయాలకు, నేటి ప్రభుత్వాల విధానాలకు నడుమ ఆందోళనకరమైన అగాధం కనిపిస్తోంది. పాఠశాలల్లో పుస్తకాలు పట్టుకుని ప్రయోగశాలల్లో మెరవాల్సిన 'జెన్ ఆల్ఫా' తరం పిల్లలు, తమ కనీస విద్యా హక్కు కోసం రోడ్డెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడటం మన పరిపాలనా వ్యవస్థ నైతిక వైఫల్యానికి స్పష్టమైన అద్దం పడుతోంది.




ఈ విద్యా సంక్షోభం ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాలేదు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా కోసాయి ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు పదవీ విరమణ చేయగా, మరొకరు అకాల మరణం చెందారు. ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో బడి తలుపులకు తాళాలు పడ్డాయి. అయినా, అక్కడ చదువుకోవాలనే ఆరాటంతో గిరిజన పిల్లలు ప్రతిరోజూ పాఠశాల ఆవరణలోనే కూర్చుని పుస్తకాలు తిరగేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారంలో తరగతి గది కూలిపోతే, ప్రత్యామ్నాయ భవనం లేక గుడిలో తరగతులు నిర్వహిస్తున్నారు. రాజస్థాన్‌లోని రాంపురా కన్వర్పురాలో విద్యార్థులు పశువుల కొట్టాల్లో కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితిపై నిరసనలకు దిగితే తప్ప ప్రభుత్వం స్పందించలేదు. అజ్మీర్, జైపూర్ లలో అపరిశుభ్ర వసతులు, పరిపాలనా వేధింపులపై బాధితులు ధర్నాలు చేపట్టాల్సి వచ్చింది.

ఉత్తరప్రదేశ్‌లో బడి గోడలే కాదు, బడికి వెళ్లే దారులు కూడా విద్యార్థులకు అడ్డంకిగా మారాయి. లక్నో, ఉన్నావ్, ఫతేపూర్, కన్నౌజ్ ప్రాంతాల్లో పరీక్షలు దగ్గరపడుతున్నా సైన్స్ ఉపాధ్యాయులు లేక పిల్లలు ప్రధాన రహదారులను దిగ్బంధించారు. మహోబాలో గుంతల రోడ్లపై, గోరఖ్‌పూర్‌లో నీటమునిగిన బురద మార్గాల్లో ఈదుకుంటూ బడికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యప్రదేశ్‌లో భోపాల్ సహా పలు జిల్లాల్లో సుమారు 25 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల మూసివేత లేదా విలీన నిర్ణయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ అభ్యర్థులు వీధుల్లోకి వచ్చారు. బీహార్ రాజధాని పాట్నాలో ఆరేళ్ల బాలుడు ఆదిత్య బిగ్గరగా గళమెత్తి ప్రజా వ్యవస్థల వైఫల్యాన్ని ప్రశ్నించడం ఈ విద్యా ఆవేదన తీవ్రతకు ప్రతీక. పిల్లలు కోరుతోంది ఏవో అసాధారణ సౌకర్యాలు కాదు; చదువుకోవడానికి ఒక గురువు, కూర్చోడానికి ఒక గది, తాగడానికి నీరు, చదవడానికి పాఠం.

ఇక్కడే పాలకుల మాటలకు, చేతలకు మధ్య ఉన్న అసలు వైరుధ్యం బయటపడుతుంది. ఒకవైపు డిజిటల్ ఇండియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), స్టార్టప్‌లు, ప్రపంచస్థాయి పరిశోధనల గురించి మైకులు పగిలేలా మాట్లాడుతున్న పాలకులు, సైన్స్ చెప్పే ఉపాధ్యాయుడు లేని పాఠశాలల వాస్తవికతను ఎందుకు విస్మరిస్తున్నారు? ప్రయోగశాలలు లేని తరగతి గదులతో జ్ఞాన సమాజం ఎలా సాధ్యమవుతుంది? ప్రాధాన్యతలకే పరిమితమైన నిధుల పంపిణీలో పిల్లల విద్యకు స్థానం ఏది? గోశాలల నిర్మాణాలకు, భారీ ప్రాజెక్టులకు వందల కోట్లు మంజూరు చేసే ప్రభుత్వాలు, కోట్లాది మంది దళిత, బహుజన, ఆదివాసీ, గిరిజన, పేద పిల్లలు చదివే ప్రభుత్వ బడులకు తగినంత బడ్జెట్ ఎందుకు కేటాయించడం లేదు?

జాతీయ విద్యా విధానం-2020 (చీజూ 2020) ప్రకారం దేశ జీడీపీ (+ఖూ)లో కనీసం 6 శాతం నిధులను విద్యకు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఏళ్ల తరబడి ఆ కనీస కేటాయింపులు కూడా ఆచరణలోకి రావడం లేదు. గత పద్నాలుగేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈ వైఫల్యాన్ని కేవలం భాజపాపై విమర్శతో ముగించలేం. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కూడా కులం, వర్గం, ప్రాంతం ఆధారంగా ఉన్న అసమానతలను మూలాల నుంచి ఉపేక్షించి, అందరికీ సమానమైన, ఉచిత ప్రజా విద్యా వ్యవస్థను నిర్మించడంలో విఫలమైంది.

ఎన్నికల సమయంలో రాజకీయనాయకులు పరస్పరం విమర్శలు చేసుకోవచ్చు; కానీ విద్యను మార్కెట్ సరుకుగా మార్చాలా లేక పౌరుల ప్రాథమిక హక్కుగా నిలబెట్టాలా అన్నదానిపై స్పష్టత లేదు. ప్రభుత్వ పాఠశాల బలహీనపడిన ప్రతిసారీ ప్రైవేటు విద్యా వ్యాపారానికి మార్కెట్ విస్తరిస్తుంది. ఆర్థికంగా బలంగా ఉన్నవారు నాణ్యమైన విద్యను కొనుగోలు చేయగలుగుతుంటే, పేద కుటుంబాల పిల్లలు అవకాశాలకు దూరమై వెనుకబడిపోతున్నారు.

పిల్లలు బడి కోసం, హక్కుల కోసం రోడ్డెక్కడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు; కానీ పిల్లలు రోడ్డెక్కాల్సిన దుస్థితిని కల్పించడమే వ్యవస్థకు అసలైన ప్రమాదం. ప్రభుత్వాలకు తక్షణమే సమగ్ర పునర్నిర్మాణ స్పృహ రావాలి. జీడీపీలో కనీసం 6 శాతం నిధులను విద్యకు తక్షణమే కేటాయించాలి. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న లక్షలాది ఉపాధ్యాయ పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలి. కోసాయి వంటి ప్రాంతాల్లో వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి; అగ్రహారం వంటి చోట్ల శిథిల భవనాల స్థానంలో ఆధునిక తరగతి గదులను నిర్మించాలి. పాఠశాలల మూసివేత, విలీనం వంటి నిర్ణయాలను వెనక్కి తీసుకుని స్థానిక పాఠశాలలను బలోపేతం చేయాలి.

విద్యను కేవలం మార్కులు, ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, ప్రశ్నించే స్వేచ్ఛను పెంచేదిగా తీర్చిదిద్దాలి. పూలే చూపిన విద్యా విముక్తి మార్గాన్ని, అంబేద్కర్ ప్రతిపాదించిన సమానత్వ దృక్పథాన్ని కలగలిపి ప్రజా విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలి. పిల్లల చేతుల్లో నిరసన ప్లకార్డులు కాకుండా పుస్తకాలు, ప్రయోగ పరికరాలు ఉంచినప్పుడే పూలే కలలు కనిన సమసమాజం, నిజమైన 'వికసిత్ భారత్' సాకారమవుతాయి.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# కాంగ్రెస్ కేబినెట్ బాంబ్

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఖాయం!

చర్చలు సాగుతూనే ఉన్నాయి. సామాజిక సమతుల్యత, జిల్లాల ప్రాతినిధ్యం మరియు కాంగ్రెస్ కోసం సుదీర్ఘకాలం శ్రమించిన నేతలకు ప్రాధాన్యత నివ్వడంపై అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో త్వరలోనే విస్తరణ ప్రక్రియ కొలిక్కి రానుందని, త్వరలోనే కొత్త మంత్రుల కలయికతో కేబినెట్ పరిపూర్ణం కాబోతోందని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు.

రాజగోపాల్ రెడ్డికి దక్కనున్న కీలక బాధ్యతలు?

కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలకమైన నాయకుడిగా, క్షేత్రస్థాయిలో బలమైన అనుచరగణం ఉన్న నేతగా గుర్తింపు పొందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రాజగోపాల్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలోకి తిరిగొచ్చిన సందర్భంలో అధిష్టానం ఇచ్చిన హామీలు, ఆయనకున్న ప్రజాదరణను పరిగణనలోకి తీసుకుంటే మంత్రి పదవి రావడం ఖాయమని వెల్లడించారు. నల్గొండ జిల్లా రాజకీయాల్లో ఆయన ప్రాతినిధ్యం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని భావిస్తున్నారు.

సయోధ్య కుదిరినట్టేనా?

ఇటీవల పార్టీ అంతర్గత వ్యవహారాలు, నామినేటెడ్ పదవుల కేటాయింపు మరియు పాత-కొత్త నాయకుల ప్రాధాన్యతలపై రాజగోపాల్ రెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశాలపై స్పందించిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. రాజగోపాల్ రెడ్డి సీనియర్ నాయకుడని, ఆయనకు పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని, తగిన సమయంలో సమగ్ర నిర్ణయం తీసుకుని ఆయనకు తగిన గుర్తింపు అందిస్తామని పేర్కొనడం ద్వారా పార్టీ అంతర్గత సర్దుబాట్లు పూర్తయినట్లు సంకేతమిచ్చారు.

అధిష్టానం ముద్ర కోసమే నిరీక్షణ

ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మరియు ఏఐసీసీ (ూ×జజ) పెద్దలు ఢిల్లీ వేదికగా ఈ విస్తరణ తుది నివేదికపై చర్చించనున్నారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల నుంచి అధికారిక ఆమోదం లభించిన వెంటనే జాబితాను రాజ్‌భవన్‌కు పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ కేడర్‌లో ఉత్సాహం నింపేలా విస్తరణ నిర్ణయం ఉంటుందని పార్టీ నాయకత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# తెలంగాణలో మారిన వాతావరణం:

## 13 జిల్లాలకు వర్ష సూచన!

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్ముకోవడమే కాకుండా, పలు ప్రాంతాల్లో పగటి పూట తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. రానున్న 24 గంటల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 13 జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదు కావచ్చునని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రతినిధులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

13 జిల్లాలకు వర్ష సూచన!

వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ఈ వర్షాల ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో చల్లని గాలులు వీస్తూ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా మారింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఆకాశం పూర్తిగా మేఘావృతంగా మారగా, మరికొన్ని చోట్ల సాయంత్ర సమయానికి చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. రాబోయే కొద్ది గంటల్లో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశముందని, కొన్ని చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం పడొచ్చని అధికారులు వెల్లడించారు.

ఉష్ణోగ్రతలకు బ్రేక్ పడే అవకాశం!

గత వారం రోజులుగా పెరిగిన పగటి ఉష్ణోగ్రతల వల్ల జనం గడప దాటి బయటకు రావడానికి జంజట పడ్డారు. ఇప్పుడు పడుతున్న ముందస్తు వర్షాల కారణంగా పగటి పూట నమోదయ్యే గరిష్ఠ ఉష్ణోగ్రతలకు విరామం లభించింది. దాదాపు రెండు నుంచి నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారికి, అలాగే ఉక్కపోతతో అల్లాడిపోతున్న వృద్ధులు, చిన్నపిల్లలకు ఈ మార్పు పెద్ద ఊరటనిచ్చింది.

మేఘాలు కమ్ముకుంటే.. వాన పడినట్టే!

రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో దట్టమైన నల్లటి మేఘాలు ఆవరించి ఉండటంతో సాధారణ ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నట్టుండి వర్షం విరుచుకుపడే అవకాశం ఉన్నందున ప్రయాణాలు చేసే వారు వాతావరణ మార్పులను గమనిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం శ్రేయస్కరం. వాహనదారులు తగిన వేగంతో వెళ్లాలని, రహదారులపై నీరు నిలిచే ప్రదేశాల్లో జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.

రైతులకు కీలక సూచనలు!

ఈ అకాల వర్ష సూచనల నేపథ్యంలో వ్యవసాయ రంగ నిపుణులు రాష్ట్ర రైతులకు పలు ప్రాముఖ్యమైన సూచనలు చేశారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను రక్షించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనుల వేళలను మార్చుకోవాలని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న తూర్పు, ఉత్తర జిల్లాల పరిధిలో చేలలో నీరు నిలిచిపోకుండా చూసుకోవాలని కోరారు.

తెలంగాణలో మరోసారి వర్షాల సందడి!

రానున్న 24 గంటల్లో వర్షాల ప్రభావం ఏ ఏ ప్రాంతాల్లో ఎలా ఉంటుందనే అంశంపై సాధారణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ద్రోణి మరియు ఉపరితల ఆవర్తనాల ప్రభావం కొనసాగితే రాబోయే రెండు మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే వీలుంది. వర్షాల రాకతో తెలంగాణ వ్యాప్తంగా సరికొత్త వాతావరణం సంతరించుకుంది.

# వడ్యాల్ గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

లక్ష్మణచాంద, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):



లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు చొరవతో మంజూరైన నూతన ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులకు ఆదివారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమారెడ్డి, లక్ష్మణచాంద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండ్ర నరేష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పసుపుల నరేష్ హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, పారుపల్లి మాజీ సర్పంచ్ ప్రతాపరెడ్డి, ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులు, నాయకులు కప్పకంటి మోహన్, పోతారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


# బోనస్ పొందేందుకు 'సన్న' సవాలు!

## ఆన్‌లైన్ నిబంధనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అన్నదాతలు!



నిర్మల్ ఆగష్టు 30 తెలంగాణ వెన్నెల వాక్కు
స్వర్ణ కమలం లాంటి విశాలమైన వ్యవసాయ భూములు కలిగిన నిర్మల్ జిల్లాలో వానాకాలం పంటల సీజన్ ఎంతో ఉత్సాహంగా, ఆశలతో ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత ఎదురైన ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కఠినమైన నిబంధనలతో రైతాంగం తీవ్ర గందరగోళంలో మునిగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి సన్న రకం ధాన్యానికి ప్రకటించిన క్వింటాకు రూ. 500 చొప్పున అదనపు బోనస్ సహాయం దక్కుతుందన్న ఆశతో పొలాల్లో చెమటోడ్చిన అన్నదాతలకు, ఇప్పుడు ఆ నిధులు పొందే ప్రక్రియ పెద్ద సాంకేతిక అవరోధాల వలయంగా తయారైంది. ప్రభుత్వం విధించిన మార్గదర్శకాల ప్రకారం, విత్తనం కొనుగోలు చేసిన సమయం నుండి పంట వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నమోదు చేసుకుంటేనే ఈ బోనస్ వర్తిస్తుందని స్పష్టం చేయడంతో జిల్లాలోని వేలాది మంది రైతులు తమ పనులన్నీ పక్కనబెట్టి విత్తన దుకాణాలు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవస్థలు ఏర్పడుతున్నాయి.

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో నిర్మల్ జిల్లా పరిధిలోని విశాలమైన విస్తీర్ణంలో భారీ ఎత్తున వరి సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ ప్రారంభంలో అంచనా వేసింది. అయితే, సీజన్ ఆరంభంలో వాతావరణం ఏమాత్రం అనుకూలించకపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల అంచనా వేసిన మేర సాగు విస్తీర్ణం పెరగలేదు. దీనివల్ల వేలాది ఎకరాల సారవంతమైన భూమి సాగుకు నోచుకోక బీడుగా మిగిలిపోయింది. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పరిమిత భూమిలోనే అత్యధిక భాగం సన్న రకం వరినే ఎంచుకుని సాగు చేపట్టారు. అయితే, వీరిలో గణనీయమైన సంఖ్యలో ఉన్న రైతులు ప్రైవేటు విత్తన కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాలను, లేదా గత సీజన్లలో తమ పంటల ద్వారా వచ్చిన స్థానిక సన్న రకాలనే విత్తనాలుగా స్వీకరించి పొలాల్లో చల్లుకున్నారు.

ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి అందించే బోనస్ నిధులు పక్కదారి పట్టకుండా, అక్రమాలకు తావులేకుండా అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే నేరుగా చేరేలా చూసేందుకు ఒక కొత్త డిజిటల్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా కేవలం ఏడు నిర్దిష్ట రకాల సన్న వరి వంగడాలకు మాత్రమే క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ అందిస్తామని అధికారికంగా ప్రకటించింది.

**ప్రభుత్వం ఆమోదించి జాబితా చేసిన ఆ ఏడు సన్న రకాలు:–**

ఆర్ఎన్ఆర్ 15048
కెఎన్ఎం 1638
బిపిటి 5204 లి హెచ్ఎంటి సోనా
జై శ్రీరామ్
డబ్ల్యూజిఎల్ 44 – సిద్ధి )
కెఎన్ఎం 7715

ప్రభుత్వ బోనస్ వర్తించాలంటే రైతులు తాము పండించిన ధాన్యం రకం సదరు ఏడు రకాల పరిధిలోకి రావడమే కాకుండా, తాము విత్తనాలు కొనుగోలు చేసిన అధీకృత డీలర్ల ద్వారా ఆ సమాచారాన్ని ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లో తప్పనిసరిగా నమోదు చేయించాల్సి ఉంటుంది. విత్తనం కొనుగోలు చేసినప్పుడు పొందిన రశీదు (బిల్లు), పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తదితర ముఖ్యమైన ధ్రువీకరణ పత్రాలను విత్తన దుకాణదారుడి వద్ద సమర్పించి డిజిటల్ ఎంట్రీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ కొందరు రైతులు విత్తన దుకాణాల్లో కొనుగోలు చేయకుండా, గత పంటలో తమ సొంత వద్ద మిగిలిన సన్న రకాలనే విత్తనంగా ఉపయోగించి ఉంటే, వారు సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులను (ఏఈఓ) సంప్రదించి 'సెల్ఫ్ డిక్లరేషన్' పత్రాన్ని సమర్పించాల్సి వస్తుంది. విత్తన బిల్లు లేదా ఈ సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా ఆన్‌లైన్ రికార్డు నమోదు కాకపోతే ప్రభుత్వ బోనస్ నిధులు ఖాతాల్లో జమ కావని స్పష్టం చేశారు.

ఇప్పటికే నిర్మల్ జిల్లా పరిధిలోని రైతులకు ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సమయానికి పంటలకు అందాల్సిన యూరియా, కాంప్లెక్స్ ఎరువుల సరఫరా సరిగా లేకపోవడం, కొత్తగా ప్రవేశపెట్టిన ఎరువుల పంపిణీ నియామక యాప్‌లలో రోజువారీగా తలెత్తుతున్న సాంకేతిక లోపాలు అన్నదాతలను మానసికంగా దెబ్బతీస్తున్నాయి. ఇటువంటి ప్రతికూల పరిస్థితులకు తోడు, ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన 'ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్' నిబంధనల ప్రక్రియ రైతులకు తీరని అదనపు భారంగా మారాయి. పంట పండించడానికి నిరంతరం పొలాల్లో రాత్రింబవళ్ళు పడాలో, లేక బిల్లులు, పాస్ పుస్తకాలు పట్టుకుని విత్తన షాపులు, మీసేవ కేంద్రాల చుట్టూ రోజూ పరుగులు తీయాలో అర్థం కాక నిర్మల్ జిల్లా రైతాంగం తీవ్ర ఆవేదన, అసహనం వ్యక్తం చేస్తోంది.

**ఈ పరిస్థితిపై జిల్లా వ్యవసాయ శాఖాధికారులు స్పందిస్తూ**

రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం సూచించిన నిబంధనలు సక్రమంగా పాటిస్తే ప్రతీ ఒక్క అర్హులైన రైతుకు బోనస్ అందుతుందని స్పష్టం చేస్తున్నారు. రైతులు కొనుగోలు చేసిన సన్న రకం విత్తనాల వివరాలను సకాలంలో ఆన్‌లైన్ చేసుకోవడం మర్చిపోవద్దని, ప్రభుత్వం అనుమతించిన 7 రకాలనే సాగు చేసి ప్రయోజనం పొందాలని సూచిస్తున్నారు. ఏది ఏమైనా, నిబంధనలను కాస్త సడలించి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గ్రామీణ స్థాయిలో సులభతరం చేసి, ప్రతి సన్న రకం సాగు చేసిన రైతుకూ న్యాయంగా బోనస్ అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లాలోని స్థానిక రైతు సంఘాలు, గిరిజన కర్షకులు ప్రభుత్వాన్ని బలంగా డిమాండ్ చేస్తున్నారు.

## సిటీ నడిబొడ్డున మరో భూ బాగోతం

న్యాయపోరాటం జరిగిందని, 1987లోనే దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తీర్పు ద్వారా సదరు స్థలంపై పూర్తి ప్రభుత్వ హక్కు నిర్ధారణ అయిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ ఆస్తిగా స్థిరీకరించబడిన ఇటువంటి విలువైన భూమిపై ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోవడం ఏమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. రూ. 500 కోట్ల విలువైన ప్రజా ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు కట్టబెట్టే విపరీత విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని ఆయన స్పష్టమైన డిమాండ్ చేశారు.

విలువైన ఆస్తుల అమ్మకంపై బీఆర్ఎస్ పోరాట హెచ్చరిక:

కేవలం అజామాబాద్ ప్రాంతంలోనే కాకుండా, రాజధాని నగర పరిధిలోని అత్యంత ఖరీదైన కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల్లో ఉన్న వేలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూముల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఖజానాను నింపుకునే నెపంతోనూ, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకూ ప్రభుత్వ ఆస్తులను విక్రయించడం దారుణమన్నారు. అజామాబాద్ ఆయిల్ ఫెడ్ భూమి కేటాయింపు నిలిపివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాధితులు మరియు ప్రజలతో కలిసి క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ పోరాటాలు చేపడతామని హరీశ్‌రావు హెచ్చరించారు.

## పెర్కపల్లిలో విద్యుత్ షాక్‌తో యువకుడు దుర్మరణం

### ఇనుప కూలర్ జరుపుతుండగా ప్రమాదం.. కేసు నమోదు





దస్తురాబాద్, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దస్తురాబాద్ మండల పరిధిలోని పెర్కపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంబాడి సతీష్ (27), తండ్రి భీమయ్య, వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. రాత్రి సుమారు పది గంటల సమయంలో ఇంట్లో ఉన్న ఇనుప ఎలక్ట్రిక్ కూలర్‌ను పక్కకు జరిపే క్రమంలో, దానికి విద్యుత్ ప్రసారం అవుతుండటాన్ని గమనించకుండా తాకడంతో తీవ్రమైన విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో దస్తురాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడి తండ్రి భీమయ్య ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇళ్లలో ఐరన్ బాడీ కూలర్లు వాడే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సరఫరా ఆన్‌లో ఉన్నప్పుడు కూలర్లను తాకడం గానీ, జరపడం గానీ చేయకూడదని, ప్లగ్ తొలగించిన తర్వాతే వాటిని కదపాలని సూచించారు.

## ఆర్ఎస్ఎస్ ది డబుల్ గేమ్:

ఆర్ఎస్ఎస్ శాంతి, సమైక్యత, లౌకికవాదం గురించి మాట్లాడుతుందని ఆయన విమర్శించారు. అయితే క్షేత్రస్థాయిలో తమ శ్రేణులకు మరియు కార్యకర్తలకు మాత్రం ద్వేషపూరిత భావజాలాన్ని నూరిపోయడం వారి నైజమని ఆరోపించారు. ఒకవైపు సార్వజనీన సమైక్యత గురించి మాట్లాడుతూనే, మరొకవైపు మైనారిటీలను లక్ష్యంగా చేసుకునే భావజాలాన్ని వ్యాప్తి చేయడం వారి ఇరుసు విధానానికి నిదర్శనమని స్పష్టం చేశారు. భగవత్ చెప్తున్న మాటలకు, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు క్షేత్రస్థాయిలో చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన ఉండదని ఒవైసీ ఎత్తిచూపారు.

చారిత్రక ఆధారాలతో ఒవైసీ దాడి:

ఈ విమర్శల క్రమంలో ఆర్ఎస్ఎస్ చరిత్రను, దాని ముఖ్య నాయకుల ప్రచురణలను ఒవైసీ పూసగుచ్చినట్లు వివరించారు. భారత స్వాతంత్ర్య పోరాట సమయం నుంచే ఆ సంస్థ వైఖరి వివాదాస్పదంగా ఉందని ఆయన ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలీరామ్ హెడ్గేవార్ జీవిత చరిత్రను ప్రస్తావిస్తూ.. నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ నాయకత్వంలో రూపుదిద్దుకున్న హిందూ–ముస్లిం ఐక్యతను తీవ్రంగా వ్యతిరేకిస్తూనే హెడ్గేవార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చారని తెలిపారు. ఈ చారిత్రక నిజం వేరే ఎవరో రాసింది కాదని, స్వయంగా ఆర్ఎస్ఎస్ ప్రచురించిన హెడ్గేవార్ అధికారిక జీవిత చరిత్రలోనే అత్యంత స్పష్టంగా పొందుపరిచారని ఆయన గుర్తుచేశారు.అంతేకాకుండా, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు మూలస్తంభంగా భావించే ఆ సంస్థ రెండో సర్ సంఘచాలక్ ఎమ్.ఎస్. గోల్వాల్కర్ భావజాలాన్ని ఒవైసీ తీవ్రంగా తప్పుపట్టారు. గోల్వాల్కర్ ప్రతిపాదించిన విధానాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకమని విమర్శించారు. 1940వ దశకంలోనే గోల్వాల్కర్ 'ఒకే జెండా.. ఒకే నాయకుడు.. ఒకే సిద్ధాంతం' అనే తీవ్రవాద భావనను బహిరంగంగా ప్రకటించారని తెలిపారు. దీనికి తోడు గోల్వాల్కర్ స్వయంగా రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్' అనే ప్రసిద్ధ పుస్తకంలోని 'ఇంటర్నల్ థ్రెట్స్' (ఆంతరంగిక ముప్పులు) అనే అధ్యాయంలో దేశంలో నివసిస్తున్న ముస్లింలు, క్రైస్తవులను దేశ భద్రతకు ప్రధాన ముప్పుగా పేర్కొన్నారని వివరించారు.

ఇలాంటి తీవ్రమైన విషపూరిత సిద్ధాంతాలను తమ పుస్తకాల్లో పొందుపరిచి, నేటికీ వాటిని తమ ప్రాథమిక బోధనలుగా కొనసాగిస్తూ విదేశీ గడ్డపై మాత్రం సామరస్యం గురించి మాట్లాడటం కంటితుడుపు చర్య మాత్రమేనని ఒవైసీ వ్యాఖ్యానించారు. మోహన్ భగవత్‌కు నిజంగా నిజాయితీ ఉంటే, గోల్వాల్కర్ రాసిన 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో మైనారిటీలకు వ్యతిరేకంగా ఉన్న అధ్యాయాలను ఖండించాలని లేదా ఉపసంహరించుకోవాలని సవాలు విసిరారు. ఒకవైపు రాజ్యాంగబద్ధమైన హక్కులను, మైనారిటీల ఉనికిని ప్రశ్నిస్తూ, మరోవైపు 'ముస్లింలు లేని భారత్ హిందూత్వ కాదు' అని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఒవైసీ తన వ్యాసంలో ఘాటుగా ముగించారు.

## ఉదయం దేవుడి ముందు దీపం ఎందుకు వెలిగిస్తాం?

### ఆ చిన్న దీపం వెనుక ఉన్న గొప్ప సందేశం

మన ఇళ్లలో ఉదయం పూజ చేసే సమయంలో దేవుడి ముందు దీపం వెలిగించడం ఒక సాధారణ ఆచారంలా కనిపిస్తుంది. చిన్న దీపం వెలిగించి, చేతులు జోడించి, దేవుడిని ప్రార్థించి రోజును ప్రారంభిస్తాం. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని చాలామంది పాటిస్తున్నారు. కానీ దీపం వెలిగించడం వెనుక ఉన్న భావాన్ని ఒక్కసారి అర్థం చేసుకుంటే.. అది కేవలం ఒక ఆచారం కాదని, మన జీవన విధానానికి సంబంధించిన గొప్ప సందేశమని తెలుస్తుంది.



దీపం అంటే వెలుగు. వెలుగు అంటే జ్ఞానం, ఆశ, మంచితనం అనే భావన మన సంస్కృతిలో ఎంతో లోతుగా ఉంది. చీకటిలో ఉన్న వస్తువులు కనిపించడానికి ఒక చిన్న వెలుగు ఎంత అవసరమో.. జీవితంలో సరైన దారి కనిపించడానికి జ్ఞానం కూడా అంతే అవసరం. అందుకే దేవుడి ముందు దీపం వెలిగించడం ద్వారా మనలోని అజ్ఞానం, భయం, నిరాశ తొలగిపోయి మంచి ఆలోచనలు కలగాలని కోరుకుంటాం.

ఒక చిన్న దీపం చుట్టూ ఉన్న చీకటిని తొలగిస్తుంది. అలాగే మనిషిలోని ఒక మంచి ఆలోచన కూడా ఎన్నో చెడు ఆలోచనలను దూరం చేయగలదు. కోపం వచ్చినప్పుడు ఒక్కసారి ఆలోచించడం, ఎదుటివారిని బాధించే మాటను ఆపుకోవడం, కష్టంలో ఉన్నవారికి సహాయం చేయడం.. ఇవి కూడా మన జీవితంలో వెలుగులాంటివే. అందుకే దీపం వెలిగించడం ఒక ఆధ్యాత్మిక ఆచారంతో పాటు మనకు మనమే ఇచ్చుకునే ఒక చిన్న గుర్తుచేసుకోవడం.

దీపం వెలిగించే సమయంలో మనం కొంతసేపు ప్రశాంతంగా ఉంటాం. ఆ క్షణాల్లో మనసు రోజువారీ ఆలోచనల నుంచి పూజ వైపు మళ్లుతుంది. రోజంతా ఏం జరగబోతుందో తెలియకపోయినా.. "ఈ రోజు మంచిగా గడవాలి" అనే ఆశతో రోజును ప్రారంభిస్తాం. ఆ ఆశే మనిషిని ముందుకు నడిపించే గొప్ప శక్తి.

మన పెద్దలు ఉదయం పూట పూజ, దీపారాధనకు ప్రాధాన్యత ఇవ్వడానికి మరో కారణం కూడా ఉంది. రోజు ప్రారంభంలో మన ఆలోచనలు ప్రశాంతంగా ఉంటే.. ఆ ప్రశాంతత రోజంతా మన ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. ఉదయం ఒక మంచి ఆలోచనతో మొదలైన రోజు.. చిన్నచిన్న సమస్యలు వచ్చినా వాటిని ఓపికగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

ఇంట్లో దీపం వెలిగించడం కేవలం దేవుడి గదిలోనే పరిమితం కావాల్సిన విషయం కాదు. మన మాటలో వెలుగు ఉండాలి. మన ప్రవర్తనలో వెలుగు ఉండాలి. మన వల్ల మరొకరి జీవితంలో కొంత ఆనందం కలగాలి. మన ఇంట్లో వెలిగించే దీపం ఎంత పవిత్రమో.. మన వల్ల మరొకరి జీవితంలో వెలిగే ఆశ కూడా అంతే పవిత్రమైనది.

ఈ రోజుల్లో మనిషి బయట వెలుగులను ఎంతో పెంచుకున్నాడు. ఇళ్లలో విద్యుత్ దీపాలు, నగరాల్లో రాత్రింబవళ్లు వెలుగులు.. అన్నీ ఉన్నాయి. కానీ మనసులోని చీకటిని తొలగించడానికి మాత్రం ఇంకా ఆధ్యాత్మిక వెలుగు అవసరం. అసూయ, కోపం, ద్వేషం, అహంకారం, భయం వంటి భావాలు మనసును చీకటిగా మార్చినప్పుడు.. వాటిని తొలగించేది బయట వెలుగు కాదు, మనలో పుట్టే మంచి ఆలోచనే. అందుకే ప్రతిరోజూ దేవుడి ముందు దీపం వెలిగించినప్పుడు ఒక చిన్న సంకల్పం కూడా చేసుకోవాలి. "ఈ రోజు నా వల్ల ఎవరికీ బాధ కలగకుండా చూస్తాను. ఒక మంచి మాట మాట్లాడతాను. అవసరంలో ఉన్నవారికి చేతనైనంత సహాయం చేస్తాను. నా మనసులో చెడు ఆలోచనలకు చోటివ్వను" అని అనుకుంటే.. ఆ దీపారాధనకు మరింత అర్థం వస్తుంది.

దేవుడి ముందు వెలిగించే దీపం చిన్నదే కావచ్చు.. కానీ అది చెప్పే సందేశం ఎంతో పెద్దది. చీకటిని తిట్టడం కంటే ఒక దీపం వెలిగించడం మంచిదని అది మనకు గుర్తుచేస్తుంది. అలాగే జీవితంలో సమస్యలను గురించి బాధపడుతూ కూర్చోవడం కంటే.. మన వంతుగా ఒక మంచి అడుగు వేయడం ముఖ్యం. మన ఇంట్లో వెలిగించే దీపంతో పాటు మన హృదయంలో కూడా మంచితనం వెలిగితే.. అదే నిజమైన ఆధ్యాత్మిక వెలుగు.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# 22-ఏ భూదోపిడీపై బీజేపీ సమరశంఖం: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

## సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాదీక్ష
## నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్నద్ధత సమీక్షా సమావేశం

నిర్మల్, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలో 22-ఏ (నిషేధిత భూముల జాబితా) ముసుగులో ప్రభుత్వం సాగిస్తున్న అక్రమాలు, భూదోపిడీని నిరసిస్తూ సెప్టెంబర్ 5, 6 తేదీల్లో తలపెట్టిన రెండు రోజుల మహా దీక్షను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష నేత (బీజేఎల్పీ), నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మహా దీక్ష సన్నద్ధతపై నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ఈ మహా దీక్షకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాల్సిన శ్రేణుల సమన్వయంపై నాయకులకు కీలక దిశానిర్దేశం చేశారు.



ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ బదిలీలు, ఆస్తుల బదలాయింపుల పేరుతో సాగుతున్న భారీ కుంభకోణాలపై ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగట్టేందుకే ఈ మహా దీక్షను చేపట్టామని స్పష్టం చేశారు. పేదలు, రైతులు కొనుగోలు చేసుకున్న భూములను అకారణంగా 22-ఏ జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను వేధిస్తున్న ఈ నిబంధనలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకునే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని, ఈ ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఉద్ఘాటించారు.
నిర్మల్ నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వివిధ స్థాయిల నాయకులు, కార్యకర్తలు, బాధిత రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి హైదరాబాద్ దీక్షలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, మేడిశెమ్మె రాజు, ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు రవీందర్ రెడ్డి, కరిపే విలాస్, అంకం మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పాటిల్

ముధోల్, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలంలోని చింతకుంట గ్రామ సర్పంచ్ గంగాధర్ పితృమూర్తి గంగారం ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను భోస్లే మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పాటిల్ ఆదివారం పరామర్శించారు. చింతకుంటలోని సర్పంచ్ నివాసానికి చేరుకున్న ఆయన మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ పెద్ద మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, సంజు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



# పాత ఎల్లాపూర్‌లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

## 60 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు స్వాధీనం: డీఎస్పీ శ్రీనివాస్

ఖానాపూర్, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మండల పరిధిలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిలో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టి, సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలతో పాటు 8 ఆటోలను స్వాధీనం చేసుకుని నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు.



ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ గ్రామస్తులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. గ్రామాల్లో యువత మత్తు పదార్థాలు, గంజాయి బారిన పడకుండా తల్లిదండ్రులు నిరంతరం కనిపెట్టుకుని ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, మైనర్ డ్రైవింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ప్రస్తుత కాలంలో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పకూడదని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు రాహుల్, సాయికుమార్, హనుమాండ్లు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి గణిత, విజ్ఞాన మేళా

ముధోల్, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి గణిత, విజ్ఞాన, సాంస్కృతిక మేళా శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ సరస్వతి విద్యాపీఠం ఆదిలాబాద్ విభాగ్ అధ్యక్షుడు భజరంగ్ లాల్ అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదురయ్యే అవసరాల నుంచే నూతన ఆవిష్కరణలకు బీజం పడుతుందని, విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను





పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్య వక్త వి.కె. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలంతా నిరంతర శ్రమ, పట్టుదలతోనే అద్భుత ఆవిష్కరణలు చేశారని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి విచ్చేసిన విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలు, సైన్స్ ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం ప్రతినిధులు, ఆచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హంగిర్గాలో ఎల్.ఎల్.బి పట్టా పొందిన అరవింద్‌కు ఘన సన్మానం

తానూరు, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూరు మండలంలోని హంగిర్గా గ్రామానికి చెందిన శీతల్కర్ అరవింద్ ఎల్.ఎల్.బి పూర్తి చేసి న్యాయవాదిగా పట్టా పొందిన సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రామంలోని బుద్ధ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్ అప్పా, ఉపసర్పంచ్ రాజు పాల్గొని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ గ్రామంలోనే మొట్టమొదటి అడ్వకేట్‌గా ఎదగడం మొత్తం గ్రామానికే గర్వకారణమని గ్రామ పెద్దలు కొనియాడారు. చదువును ఆయుధంగా చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకున్న అరవింద్ గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. భవిష్యత్తులో న్యాయవాదిగా పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# బాధితులకు ఎల్ఓసీ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కులను బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదివారం అందజేశారు. సారంగాపూర్ మండలం బోరిగాం గ్రామానికి చెందిన గుమ్ముల నర్సింహులు వైద్య చికిత్స కోసం రూ. 2 లక్షల విలువైన ఎల్ఓసీ చెక్కును అందజేశారు. అలాగే నిర్మల్ పట్టణంలోని నాయిడివాడకు చెందిన నామెద గంగామణి కుటుంబానికి చికిత్స నిమిత్తం రూ. 75 వేల చెక్కును అందించారు. ఆపద సమయంలో తమ కుటుంబాలకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపినందుకు బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# విట్టోలి గ్రామంలో ఘనంగా అన్నాభావూ సాఠే జయంతి

ముధోల్, ఆగస్టు 30 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామంలో సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్నాభావూ సాఠే 106వ జయంతి వేడుకలను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ కాలేవర్ రుచిత దిగంబర్ సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన విప్లవాత్మక సాహిత్యంతో సామాజిక చైతన్యాన్ని రగిలించి, శ్రామిక, పీడిత వర్గాల హక్కుల సాధనకు మార్గం చూపిన మహనీయుడు అన్నాభావూ సాఠే అని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలు, ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని, సమాజంలో సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివరాజ్, మాజీ సర్పంచ్ సత్యగౌడ్, నగేష్ పటేల్, దిగంబర్ పటేల్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-